క్లుప్తంగా

ఉసేన్‌స్వామి దర్గాలో భక్తుల రద్దీ



దర్గాలో ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు గ్రామంలో వెలసిన ఉసేన్‌స్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. జిల్లాతోపాటు కర్నూలు, వైఎస్సార్, అనంతపురం, తదితర జిల్లాల నుంచి భక్తులు తరలిరావడంతో దర్గా భక్తులతో కిటకిటలాడింది. భక్తులు స్వామివారికి పూలదట్టీలు, జెండాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు



వరి రైతులతో మాట్లాడుతున్న ఏఓ జ్యోతి

కొలిమిగుండ్ల: వరి సాగులో రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ జ్యోతి సూచించారు. గురువారం పొలం బడి కార్యక్రమంలో భాగంగా బెలుం శింగవరంలో వరి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు వరి నారును సూజమోనాస్ జీవ సిలీంద్రంతో శుద్ధి చేసి నాట్లు వేసుకోవడం ద్వారా ఎండుతెగులు సోకదన్నారు. సూజమోనాస్ ఎరువును వరి పండించే రైతులకు అందజేశారు. కార్యక్రమంలో వీఏఏ చిన్నయ్య, రైతులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కరీంబాషా

కోవెలకుంట్ల: అచ్యుతాపురం ఫార్మా సెజ్ మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేసియా చెల్లించాలని అఖిల భారత్ కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా నాయకుడు కరీంబాషా డిమాండ్ చేశారు. గురువారం ఆయన కోవెలకుంట్లలో విలేకరులతో మాట్లాడుతూ మృతుల ఒక్కో కుటుంబానికి రూ. కోటి, గాయపడిన వారికి రూ. 20 లక్షల చొప్పున పరిహారం అందించాలన్నారు. అదేవిధంగా బాధిత కుటుంబాల్లో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల భద్రతను ఏ మాత్రం పట్టించుకోని యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు కంబగిరి రాముడు, సుబ్బారెడ్డి, రెడ్డిపల్లె ఓబయ్య, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



చిన్నారుల హెల్త్ రికార్డులు పరిశీలిస్తున్న నోడల్ ఆఫీసర్

కోవెలకుంట్ల: చిన్నారుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రీయ బాల స్వస్థిక్ కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) నోడల్ ఆఫీసర్ డాక్టర్ కాంతారావునాయక్ సూచించారు. స్కూల్‌హెల్త్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని రేవనూరు గ్రామంలోని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలల్లో చిన్నారులు, విద్యార్థుల హెల్త్ రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో దోమల మూలంగా వివిధ జ్వరాలు ప్రబలే అస్కారం ఉందన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో రేవనూరు పీహెచ్‌సీ డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్ సుబాని, హెల్త్ సూపర్‌వైజర్లు గిరిజ, ప్రభావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యువతి వివాహానికి చేయూత



సాయం అందజేస్తున్న స్ఫూర్తి టీం

డోన్ టౌన్ : పట్టణంలోని కొండపేటలో నివాసం ఉంటున్న జగన్నధరావు, సంధ్యాబాయి దంపతుల కుమార్తె చైతన్యకు పెళ్లి నిశ్చయం అయ్యింది. పేదవారు కావడంతో పెళ్లి ఖర్చుల కోసం ఇబ్బందులు పడుతుండగా సమాచారం అందుకున్న స్ఫూర్తి సేవా సంస్థ చేయూత అందించింది. దాతల సహకారంతో రూ.35వేల విలువ చేసే బంగారు తాళి బొట్టు, వెండి మెట్టెలుతో పాటు పట్టు చీరలు, బియ్యం, నిత్యావసర సరుకులు, కొంత నగదును గురువారం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు సీసంగుంతల మధు, సభ్యులు చంద్రమోహన్‌రెడ్డి, భాస్కర్, హేమలత, కొచ్చెర్వు నారాయణస్వామి, రఫీ తదితరులు ఉన్నారు.

కస్తూర్బా విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- గోప్యంగా ఉంచిన అధికారులు
- ఆలస్యంగా వెలుగు చూసిన వైనం
- ఎస్‌ఓ, ఎంఈఓ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



అవుకులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం



ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని (ఫైల్)

అవుకు: బాలికల విద్యాభివృద్ధే లక్ష్యంగా నెలకొల్పిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లోనూ వారికి అడ్డంకులు కలుగుతూనే ఉన్నాయి. పేదవిద్యార్థినులను చులకనగా చూస్తున్న కస్తూర్బా అధికారుల కొందరి తీరుతో మనస్థాపానికి గురవుతున్నారు. పేదలైన తల్లిదండ్రులకు చెప్పుకోలేక... ఎస్‌ఓను ఎదిరించలేక మగ్గుతూనే విద్యనభ్యశిస్తున్నారు. చివరకు ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్నారు. ఐదురోజుల కిందట మండల కేంద్రం అవుకు కస్తూర్బాలో ఓ విద్యార్థిని ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. ఈ సంఘటనను ఎస్‌ఓ భవానీ, ఎంఈఓ శ్రీధర్‌రావు గోప్యంగా ఉంచినా ఆలస్యంగా ఐదురోజుల తర్వాత గురువారం వెలుగు చూసింది. కొలిమిగుండ్ల మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లెకు చెందిన గోవిందప్ప, సునీత దంపతుల కుమార్తె మేఘన అవుకు కస్తూర్బాలో ఇంటర్ ఎంపీసీ చదువుతుంది. పాఠశాలలో చేరిన నాటి నుంచి కొందరు తోటివిద్యార్థినుల చేష్టలతో ఇబ్బందులకు గురువుతూనే ఉంది. ఎస్‌ఓకు విషయాన్ని చెప్పినా పట్టించుకోవడంతో ఆ విద్యార్థిని ఇబ్బందులు పడుతూనే ఉంది. ఈ నేపథ్యంలో ఆగస్టు 15న వేడుకలకు సంబంధించి వస్తువులను తీసుకురావడానికి ఎస్‌ఓ తనతోపాటు మేఘనని బయటకు తీసుకెళ్లారు. అక్కడ పేడరంగు ప్యాకెట్లను తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 18న ఆ పౌడర్‌ను నీటిలో కలుపుకొని తాగింది విద్యార్థిని మేఘన. వాంతులు చేసుకోవడాన్ని గమనించిన మరో విద్యార్థిని పాఠశాల సిబ్బందికి తెలియజేయడంతో హుటాహుటిన అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేసి బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వారు వచ్చి బోరున విలపించారు. చికిత్స అనంతరం కోలుకున్న విద్యార్థిని గురువారం డిశ్చార్జ్ అయ్యింది. ఈ నేపథ్యంలో తమ అమ్మాయిని ఎందుకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రశ్నించిన తల్లిదండ్రులపై సైతం ఎస్‌ఓ ఆగ్రహం వ్యక్తం చేయడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో విద్యార్థిని టీసీ తీసుకోవడంతో ఆత్మహత్యాయత్నం వెలుగు చూసింది. ఘటనపై పాఠశాల ఎస్‌ఓ భవానీని వివరణ కోరగా నాకే తెలియదు. మీకు ఏమి సమాచారం కావాలన్నా ఎంఈఓను అడగండంటూ సమాధానమిచ్చారు. ఎంఈఓ శ్రీధర్‌రావుకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది.

ఎస్‌ఓ తీరుపై మొదటి నుంచి విమర్శలే...

అవుకు కస్తూర్బా ఎస్‌ఓ భవానీ తీరుపై మొదటి నుంచీ విమర్శలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. గతంలోనూ విద్యార్థినుల తల్లిదండ్రులతో దురుసుగా వ్యవహించిన సంఘటనలు లేకపోలేదు. అప్పుడప్పుడు విద్యార్థినులు ఫుడ్ పాయిజన్‌కు గురవుతున్నా ఎస్‌ఓ తీరులో మార్పులేదని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థిని మేఘన తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. తమ బిడ్డ ఇప్పటికే మూడుసార్లు ఫుడ్ పాయిజన్‌కు గురైందని, ఎందుకిలా జరుగుతుందని ప్రశ్నించిన తమపై ఎస్‌ఓ దురుసుగా ప్రవర్తించారని గుర్తు చేశారు. ఇష్టం లేకుంటే టీసీ తీసుకెళ్లండంటూ హెచ్చరించారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలోనూ ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం.

మా బిడ్డ ప్రాణాలతో ఉండాలంటే... పాఠశాలను వదిలి వెళ్లాల్సి వస్తుంది!

మా బిడ్డ మాకు ప్రాణాలతో దక్కాలంటే కస్తూర్బా పాఠశాలను వదిలి వెళ్లాల్సి వస్తుందని కన్నీరు పెట్టుకున్నారు మేఘన తల్లిదండ్రులు. గతంలోనూ మా బిడ్డతో మాట్లాడేందుకు ఎస్‌ఓకు ఫోన్ చేస్తే సరైన నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. పాఠశాలలో చేరినప్పటి నుంచి మా బిడ్డకు పలుమార్లు ఫుడ్ పాయిజన్ అయ్యి అవుకు ఆసుపత్రిలోనే చికిత్స తీసుకున్న సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. దీంతో అప్పట్లో మూడు రోజులు అక్కడే ఉండి భోజనాన్ని రుచి చూశామన్నారు. భోజనం సరిగా ఉండటంలేదని ఎస్‌ఓకు వివరించిన స్పందించలేదని, ఇక్కడ ఇలాగే ఉంటుందని నిర్లక్ష్యంగా చెప్పారని గుర్తు చేశారు. మా కూతురు చదువుకోకపోయినా పర్వాలేదని, బ్రతికి ఉంటే చాలనే ఈ పాఠశాల నుంచి టీసీ తీసుకొని వెళ్తున్నామని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

28న యాగంటిలో బహిరంగ వేలాలు

బనగానపల్లె రూరల్ : మండలంలోని ప్రముఖశైవ క్షేత్రం యాగంటిలో వెలసిన శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయ ఆవరణలో పలు వ్యాపారాలు నిర్వహిం చుకునేందుకు ఈ నెల 28న బహిరంగ వేలాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి గురువారం తెలిపారు. కొబ్బరికాయాలు, పండ్లు, బొమ్మలు, ఐస్‌క్రీమ్ అమ్ముకునేందుకు, తలానీలాలు, కొబ్బరి చిప్పలు పొగు చేసుకునే హక్కులను పొందుట వేలాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగల వారు డిపాజిట్ చెల్లించి వేలాల్లో పాల్గొనవచ్చన్నారు.

తప్పులు లేకుండా పంట నమోదు చేయాలి

డోన్ రూరల్ : పంట నమోదు కార్యక్రమాన్ని తప్పులు లేకుండా చేయాలని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్‌షఫి గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచించారు. మండల పరిధిలోని చనుగొండ్ల, ఎద్దుపెంట గ్రామాలలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. ఆయన వెంట గ్రామ వ్యవసాయ సహాయకులు మాధవీలత, విజయ్‌కుమార్ ఉన్నారు.

26న హిందూ ఆత్మీయ సమ్మేళనం

బనగానపల్లె రూరల్ : విశ్వహిందూ పరిషత్ షష్ఠి పూర్తి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 26న హిందూ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అధ్యక్షులు వడిశెల రమణారెడ్డి, కార్యదర్శి గెలగాని ఓబులరెడ్డి గురువారం తెలిపారు. పట్టణంలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సమ్మేళనం ఉంటుందన్నారు.

శాంతియుత జీవనం గడపాలి



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

బేతంచెర్ల : గ్రామాల్లో ప్రతి ఒక్కరూ కక్షలు కార్పణ్యాలకు దూరంగా ఉండి శాంతియుత జీవనం గడపాలని సీఐ డీ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం రాత్రి మండల పరిధిలోని సిమెంట్ నగర్, బుగ్గానిపల్లెతండా గ్రామాలను ఎస్‌ఐ పీ అశోక్ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈసందర్భంగా గ్రామస్తులతో మాట్లాడారు. చెడు వ్యసనాలకు, ముఖ్యంగా నాటుసారా, పేకాట, జూదం లాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. సైబర్ క్రైమ్ పై అప్రమత్తంగా ఉండాలన్నారు. రహదారి నిబంధనలు పాటించాలని, యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండి గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని సూచించారు.

పెన్నుల పంపిణీ

డోన్ టౌన్ : సినీహీరో చిరంజీవి పుట్టిన రోజును పురస్కరించుకొని గురువారం ఆయన అభిమానుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. పట్టణంలోని రోకలి బండ జెడ్పీ స్కూల్లో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం చంద్రుడు ఆధ్వర్యంలో చిరంజీవి సేవా సమితి సభ్యులు ప్రవీణ్, బాషా, నాగరాజు, శంకర్‌లు విద్యార్థులకు అందజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని గురువారం ఎస్‌ఐ రమణయ్య అరెస్ట్ చేశారు. గ్రామంలో ఎస్సీ కాలనీ చివరిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ తమ సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. నిందితుల దగ్గర నుంచి రూ.2,700 నగదును స్వాధినం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ తెలిపారు.

వంద పడకల ఆసుపత్రిని తీర్చిదిద్దండి

డోన్ టౌన్ : గత ప్రభుత్వ హయాంలో నూతనంగా నిర్మించిన వంద పడకల ఆసుపత్రికి పూర్తి స్థాయిలో వైద్యులను, సిబ్బందిని నియమించి అన్ని రకాల పరికరాలను ఏర్పాటు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తకాపు హేమసుందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో గురువారం రాష్ట్ర వైద్యవిద్య, ఆరోగ్య, కుటంబ సంక్షేమశాఖ మంత్రి సత్యకుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ హైవేపై నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, క్షతగాత్రులను కర్నూలు ఆసుపత్రులకు రెఫర్ చేస్తుండటంతో మార్గ మధ్యలో ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఉన్నాయన్నారు. అందువల్ల వంద పడకల ఆసుపత్రిని పూర్తి స్థాయిలో తీర్చిదిద్దాలని కోరారు. ఈ విషయంపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్యాపిలి: మండల పరిధిలోని సిద్దనగట్టు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పుస్తకాలు పంపిణీ చేశారు. దాత తనూజ పాఠశాలకు చెందిన విద్యార్థులకు రూ.5 వేలు విలువ చేసే అట్టలు, పుస్తకాలు, ఇతర సామగ్రి అందజేశారు. ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు మాదమ్మ, ఉపాధ్యాయులు ఖలీల్ బాషా, ప్రసాద్, ఇన్నర్ వీల్ మాజీ అధ్యక్షురాలు శైలజ, సభ్యులు అనురాధ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కొలిమిగుండ్ల: తుమ్మలపెంట సమీపంలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ ఎనిమిదవ గేట్ వద్ద గురువారం కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. గ్రామానికి చెందిన యాతం పెద్దిరెడ్డి మద్యం విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేశామన్నారు. అతని నుంచి 113 కర్ణాటక హైవార్డ్స్ చీర్స్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ముద్దాయిని అరెస్ట్ చేసి కోవెలకుంట్ల కోర్టులో హాజరు పర్చామని చెప్పారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలో అదే గ్రామానికి చెందిన గద్దల సుబ్బారావు అనే వ్యక్తి వద్ద పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య గురువారం తెలిపారు. సమాచారం మేరకు దాడులు నిర్వహించి మద్యం విక్రయిస్తుండగా నిందితుడిని అరెస్టుచేసి, కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ప్యాపిలి: రాచర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీతమ్మ తండా కొండల్లో గురువారం రాచర్ల ఎస్‌ఐ లక్ష్మణరావు తన సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. నాటుసారా బట్టీలను ధ్వంసం చేసి 200 లీటర్ల బెల్లం ఊటను పారబోశారు.

గ్రామాలు.. మురుగు కూపాలు





ముచ్చలపురిలో దేవాలయం ముందు మురుగు నీరు
(ఇన్‌సెట్)సంజామలలో నిల్వ ఉన్న మురుగు నీరు

సంజామల: మండలంలోని గ్రామాలు మురుగు కూపాలుగా దర్శనమిస్తున్నాయి. వర్షకాలంలో కావడంతో ప్రతి కాలనీ చితడిగా ఉంది. దానికి తోడుగా మురుగు నీరు ఇళ్ల మధ్యన నిలిచి ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు వెంటాడుతున్నాయి. సంజామల పడమటి కాలనీలో డైనేజీ కాల్వలు బ్లాక్ కావడంతో మురుగు నీరు నిల్వ ఉంది. ముచ్చలపూరి గ్రామంలో మురుగు సమస్య తీవ్రంగా ఉంది. గ్రామం చుట్టూ పరిమడులు ఉండడంతో దోమల బెడద తీవ్రంగా ఉంది. దానితో పాటు మురుగు నీరు చెరువులులాగా ఉండడంతో దోమలు విజృంభిస్తున్నాయి. సీజన్ వ్యాధుల బారిన పడకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉపాధి హామీ పథకం పనులపై నేడు గ్రామసభలు

కోవెలకుంట్ల: మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద 2024–25 ఆర్థిక సంవత్సరంలో మండలంలో చేపట్టాల్సిన పనులపై శుక్రవారం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సయ్యదున్నీసా తెలిపారు. 17 గ్రామ పంచాయతీల పరిధిలో గ్రామాలకు నియమించిన మండలస్థాయి స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో గ్రామ సభలు సాగుతాయన్నారు. గ్రామసభల నివేదికలను స్పెషల్ ఆఫీసర్లు మండల పరిషత్ కార్యాలయంలో సమర్పిస్తారని పేర్కొన్నారు.

బనగానపల్లె రూరల్ : మండలంలోని టంగుటూరు గ్రామంలో 2024–25 ఉపాధి పనుల గుర్తింపు కోసం శుక్రవారం నిర్వహించే గ్రామసభకు విజయవంతం చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు కోరారు. గురువారం మండలంలోని టంగుటూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహణకు సంబంధించి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, కూలీలు తప్పనిసరిగా పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సభ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందన్నారు.

ఉరుముల ధాటికి పేలిన టీవీ

బేతంచెర్ల : మండలంలోని యంబాయి గ్రామంలో బుధవారం రాత్రి ఉరుములు, మెరుపుల ధాటికి గ్రామానికి చెందిన మాల నాగలక్ష్మి ఇంట్లో టీవీ పేలి మంటలు వ్యాపించి వంట సామన్లు, దుస్తులు, పైపులు, నిత్యావసర వస్తువులు కాలిపోయాయి. సుమారు రూ. 50 వేల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. సమాచారాన్ని విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే సరఫరా నిలిపి వేయడంతో పెనుప్రమాదం తప్పిందని వెల్లడించారు.

అందుబాటులో ట్రైకోడెర్మా, సూడోమోనాస్

డోన్ టౌన్ : బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు అవసరమయ్యే ట్రైకోడెర్మా, సూడోమోనాస్ అందుబాటులో ఉన్నట్లు వెంకటాపురం రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకుడు వెంకట్రాముడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయంలో పలు రకాలుగా వినియోగించే పై మందులు కిలో వంద రుపాయల ప్రకారం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కావల్సిన రైతులు బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ రాఘవేంద్ర చౌదరి సెల్ నంబరు 7660060031ను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



చిత్ర లేఖనం పోటీల్లో విద్యార్థులు

బేతంచెర్ల : పట్టణంలోని ఓం శాంతి నిలయంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా గురువారం బ్రహ్మకుమారి మాధవి ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొని శ్రీ కృష్ణుని చిత్రాలను గీశారు. ప్రతిభ కనబరచిన వారికి ఈనెల 27న బహుమతులను ప్రదానం చేస్తామన్నారు.

ఎస్‌బీఐని కొండపేటకు మార్చాలి

డోన్ టౌన్ : నిత్యం రద్దీగా ఉండే కొండపేట ప్రాంతానికి పట్టణంలోని ఉన్న ఎస్‌బీఐ రెండవ బ్రాంచ్‌ను మార్చాలని సమగ్ర వినియోగదారుల రక్షణ సంఘం అధక్షుడు ఏఈ నాగరాజు డిమాండ్ చేశారు. పట్టణంలో ఎస్‌బీఐ బ్రాంచ్‌లు రెండూ ఒకే చోట ఉన్నాయన్నారు. పాతబస్టాండ్ సమీపంలోని ముక్తేశ్వర ఆలయంలో గురువారం పాత్రికేయులతో ఆయన మాట్లాడారు. కొండపేట నుంచి వినియోగదారులు బ్యాంక్‌కు రావాలంటే అనేక కష్టాలు ఎదుర్కొవాల్సి వస్తోందన్నారు. అంతేకాక కొండపేట వైపు అనేక గ్రామాలు ఉన్నాయని చెప్పారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల : మండలంలోని గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు విద్య, వైద్యం, విద్యుత్, పశువైద్యం, వ్యవసాయం, ఉపాధి హామీ పథకం తదితర శాఖల నివేదికలను వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుద్ధ్యం సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవడమే కాకుండా తాగునీటి ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గోరుమానుకొండ గ్రామ సమీపాన ఉన్న మోడల్ స్కూలు, బీసీ రెసిడెన్షియల్ స్కూలు, కళాశాల, ఐటీఐ, ఎంఎస్‌ఎంఈలకు గోరుకల్లు రిజర్వాయర్ నుంచి వచ్చే నీటిని సరఫరా చేయాలని, నిధులు మంజూరైన పాలిటెక్నిక్ భవన నిర్మాణ పనులు చేపట్టాలని గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు కోరారు. కార్యక్రమంలో డీటీ మధు, ఈఓఆర్డీ వెంకట రంగ నాయకులు, వైస్ ఎంపీపీ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

బేతంచెర్ల : పంటల సాగులో రైతన్నలు సస్యరక్షణ చర్యలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని బనగానపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ధనలక్ష్మి, సుధాకర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజనలో 28 మంది రైతులకు వేరుశనగ పంట కొత్త రకం టీసీజీఎస్ 1694 ను శాస్త్రవేత్తలు ఇచ్చారు. ఆ పంటలను పరిశీలించి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఏఓ కిరణ్ కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్ వేణు, ఏఈఓ మహమ్మద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న బ్రహ్మానంద ఆచారి

బనగానపల్లె రూరల్ : మండలంలోని పలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు దువ్వూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ తెలుగు పండింట్ సుబ్రహ్మణ్యం సహకారంతో రూ.5,000 ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యంను పాఠశాల హెచ్‌ఎం గౌరిశంకర్, జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జెఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి, ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందించారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



సాయిచరణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

బనగానపల్లె : జాతీయ స్థాయి కరాటే పోటీల్లో స్థానిక ఏపీ మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థి కె.సాయిచరణ్ తేజా ప్రతిభ కబరచి గోల్డ్‌మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ రామలక్ష్మి తెలిపారు. ఈ నెల 15 నుంచి 18 వరకు హరియాణా రాష్ట్రంలోని చండీఘడ్‌లో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఏపీ తరుపున 30 మంది పాల్గొనగా అందులో ఆరుగురు పతకాలు సాధించిన్నట్లు తెలిపారు. సందర్భంగా సాయిచరణ్‌ను అభినందించారు. కార్యక్రమంలో పీడీ సిరాజున్, అమిరూన్, కరాటే మాస్టర్ కళ్యాణ్‌బాబు, రఫీ, బాషా తదితరులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతోనే హెచ్‌ఐవీ నిర్మూలన

డోన్ టౌన్ : ముందు జాగ్రత్తలతోనే హెచ్‌ఐవీ నిర్మూలన సాధ్యమవుతుందని మున్సిపల్ శాలిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా, హ్యాడ్స్ స్వచ్ఛంద సంస్థ మేనేజర్ మధుకుమార్ అన్నారు. పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో గురువారం పారిశుద్ధ్య కార్మికులకు హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఐవీ ఏవిధంగా సోకుతుందో, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. హెచ్‌ఐవీ పరీక్షలు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా చేస్తారని, హ్యాడ్స్ సంస్థలో కూడా చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో హ్యాండ్స్ సభ్యులు సరస్వతి, షాజహాన్, సోఫియా, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



బేతంచెర్లలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

బేతంచెర్ల : కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి, హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని విద్యార్థి యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులతో పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి, పాత బస్టాండులో మానవహారంగా నిలిచి నిరసన తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రమేష్ నాయక్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మధు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.